# ఆమె పిలిచింది

ఆ వూరు అతనికి కొత్త కాదు. ఆ వూరతనికి పాత కూడా కాదు. ఇదివరలో ఒకసారి వచ్చాడు. ఇప్పుడు మళ్ళా రెండో సారి వచ్చాడు.

నిన్ననే వచ్చాడు. కొత్తపేటలో ఒక మిత్రుడి ఇంటిలో బస చేశాడు.

ఊరు చూద్దామని బయలుదేరాడు.

ఆ వీధిగుండా ఇదివరలో ఒకసారి వెళ్ళేడు.

అది సానివీధి కాదు. సంసార్ల వీధే.

వీధి మొదట్లో వుండగానే కొంతదూరంలోని ఒక ఇంటి గుమ్మంనుంచి ఓ సుందరాంగి తొంగిచూస్తూ వుండటాన్ని అతను చూస్తూనే వున్నాడు. మళ్లా ఒక్కసారి అటు చూసి, ఆమె గురించే ఆలోచిస్తూనే నడిచాడు.

ఎవరబ్బా ఆమె? అలా ఎందుకు చూస్తోంది?

తన వేపే ఎందుకు చూస్తోంది?

ఇది సానివీధి కాదే! అయినా వేశ్యలు ఎక్కడ వుండరు గనక?

ఎక్కడుంటారు? ఏమో తనకేం తెలుసు?

అయినా ఇది సాయంకాలం కాదే?

ఎందుకలా చూస్తోంది మరి?

తను అందంగా వుంటాడని మిత్రులు కొంత మంది అంటారు.

'నిన్ను చూస్తే ఎవరికైనా ప్రేమ పుడుతుంది'

మిత్రుడు జగన్నాథం అంటాడు మరి.

తలెత్తి చూశాడు.

ఆమె ఇంకా అక్కడే వుంది.

సందేహం లేదు....ఆమె ఇంకా తనవేపే చూస్తోంది.

అవును తన్నే చూస్తోంది. తనకు దృష్టి లోపంలేదు. 'హ్రస్వ దృష్టి' 'దీర్ఘదృష్టి' వగైరాల్లేవు. తనకు కళ్ళద్దాలు అవసరం లేదు. ఇంకా కూలింగ్ గ్లాస్ తగిలించుకొంటే, తన అందానికి బావుంటుంది. ఇది తను అనుకొనేదే కాదు. మిత్రులు అంటూ వుంటారు కూడాను. ఈసారి కొని ... వేసుకోవాలి. వెధవది ... మహా అయితే ఇరవై రూపాయ లవుతుందేమో. అంతేగా? లేకపోతే ఏమిటీ వెధవ బ్రతుకు ... చక్కా ... కూలింగ్ గ్లాస్ లేకుండా! ఇంతకూ ఆవిడ ఎందుకు చూస్తోందీ అని?

అంత అపేక్షగా ఎందుకలా చూస్తుందీ?

పాపం ఆవిడ మంచిదే, సంసారం చేస్తున్నదే! పతివ్రతే! కానీ తనని చూసి దిమ్మరపోయి వుంటుంది!

అంతే! అంతే! తను సినిమాలలో వెళ్ళి చేరిపోయినా బావుండును. తారాజువ్వల్లే పైకొచ్చే యొచ్చు!

మామయ్య అదే అంటాడు. ఆయన అనకేంలే! ...

ఆమె దగ్గర పడుతోంది. ఆ యిల్లు దగ్గర కొస్తోంది.

ఆ యిల్లు తనకు దగ్గర కొస్తోందా?

తనా యింటికి దగ్గర పడుతున్నాడా...?

ఏది నిజం...ఏది నిజం...?

ఇది బొత్తిగా చెప్పదంటు ప్రశ్న కానే కాదు!

న్యూటన్ ప్రశ్న ఎలాంటిది? ఆ ప్రశ్న తోచడం వల్లే అతడు గొప్ప మేధావి అయిపోయాడు!! తన ప్రశ్నకూడా అలాంటిదే! తనలో మేధాశక్తి వున్నదని విఘ్నేశ్వర్రావు నమ్మకం. కానీ దాన్ని బయల్పరచి నలుగురికీ అందజేసి, నలుగురి మెప్పునూ పొందడ మెలాగో, దాని కిటుకు లేమిటో, తనకు బొత్తిగా తెలీనే తెలీదనే దాన్ని, అతడు ఒప్పుకు తీరుతాడు.

ఆమెను కొంత దగ్గర నుంచి చూడగలిగిన తర్వాత... ఆమె తనకిట్టే అర్థమైపోయి నట్లనిపించింది.

ఇన్నాళ్ళకు తన బ్రహ్మచర్యం బ్రద్దలవ బోతోం దను కొన్నాడు! అయితే అయిందిలే అనుకొన్నాడు. ఆమెను మరీ సమీపించిన తర్వాత మరొకసారి పరిశీలనగా ఆమె మొహం చూశాడు. ఏదో కలవరపాటు మొహం నుంచి అప్పుడే 'ఫేడవుట్' అవుతూ (తన్నుచూసి...) ప్రశాంతత 'ఫేడిన్' అవుతూ వున్నట్లనిపించింది.

వచ్చేశాడు... విఘ్నేశ్వర్రావు. ఆ యింటి ముందు కొచ్చేశాడు. ఆమె పిలిచింది...

"పిలిచింది పిలిచింది
ప్రేమ పొలకగ నామె"

ఆమె విఘ్నేశ్వర్రావును పిలిచింది. ఏమని పిలిచింది? 'ఇలా ఒకసారి వస్తావా బాబూ' అని పిలిచింది.

అన్యాయం! అప్రస్తుతం! ఇన్‌సల్ట్...ఒక ఆడది! అందులో అందమైన ఆడది... 'బాబూ' అనడం, తనని మగవాడుగా నైనా లెక్కచేయక పోవడం ఇన్‌సల్ట్... ఇన్‌సల్ట్... !

తనలోని మానవత్వం అప్పుడేమైందో తనకు తెలీదు. అతని దృష్టిలో ఆమె 'కామ స్వరూపిణి'గా అవుపిస్తోంది. ఆమె పిలిచింది!

అవును — మరిచాడు. మొదట ఇలానే పిలుస్తారు. లోపలికి వెళ్ళిం తర్వాత 'హా ప్రియా' అంటారు. అవు నవును, ఇదే నిజం! ఇదే నిజం! ఇదే నిజం కావాలి కూడాను !. ఆమె ముఖపద్మంలో ప్రశాంతత రాజ్య మేలుతోంది!

ఆమె తను వస్తాడనే నమ్మకంతో ఇంట్లోకి వెళ్తోంది. అయితే ఆరితేరిన ఘటమే.

వెళ్తున్న వాడు ఆగాడు. కుడి తట్టుకు తిరిగాడు! కాళ్లు తడబడ్డాయి. పెదవులు వణికాయి. శరీరం జలదరించింది.

తనకిలాంటి విషయాలు తెలీవు. ఎప్పుడూ అనుభవంలేదు. మిత్రులు చెప్పారు. సాహిత్యం చెప్పింది. విన్నాడు. చదివాడు. ఊహించాడు...అంతే! అంతవరకే! తను తను కాకుండా అయి పోయి—

తనలోని మానవత్వాన్ని — ఏమో చేసుకొని, తన 'దృక్పథానికి' తానాశ్చర్య పడకుండా — సిగ్గు పడకుండా తన మనసు మనసులో లేనట్టి స్థితిలో—

విఘ్నేశ్వరరావు ఎలాంటి విఘ్నమూ లేకుండా, ఆ ఇంట్లో ప్రవేశించాడు. ఆ క్షణంలో అద్దంలో మొహం చూసుకొని వుంటే 'తనెవరనే' ప్రశ్న ఉత్పన్నమయ్యేదే! లోపల బనీను చెమటతో తడిసి పోతోంది!

"కూర్చో నాయనా" అందామె, మంచినీళ్ళ గ్లాసు చేతి కందిస్తూ. ఇన్‌సల్‌ట్ ... గ్రేట్ ఇన్‌సల్ట్. నాయనా అట! వెంటనే కౌగిలించుకోక...ఇదేమిటీ అని! 'గంటన్నర నుంచీ చూస్తున్నాను బాబూ! ఎవ్వరూ కనిపించ లేదు. ఒకాయన్ని పిలిస్తే ఇప్పుడు తీరిక లేదన్నాడు...

ఆమె చెప్తున్నది అతడికి అర్థంకాలేదు.

గంటన్న రేమిటె? ఆ ప్రవరుడెవడు? వాడికి తీరిక ... తీరిక...హి హ్హి హ్హి...

'మా ఆయన ఉత్తరం రాశారు ......'

'అప్రస్తుతం! వాళ్ళాయన ఏం రాస్తే నాకేం? ఆ సంగతి నాతో చెప్పండ మీనింగ్ లెస్!

"నాకు తెలుగు కొద్దిగా వచ్చు"

'ఇంత అందమైన ఆడదానికి,...ఆ తెగు లెందుకూ?...

'ఉత్తరాన్ని కూడి కూడి చదువుకోగలను కానీ సరీగా బోధపడదు.'

'వండర్‌ఫుల్! చదివితే అర్థంకాదా! ఇంతకూ ఈమె ఇదంతా ఎందుకు...ఈ సోదెంతా దేనికి చెప్తోంది? హరి హరీ!

'ఆయన కవిత్వం రాస్తారు...అది అర్థమై ఏడవదు...'

'హా చంద్రమతీ! ఆయన కవిత్వం రాస్తే నాకేం? కథలల్లితే నాకేం? ఇదంతా ఎలా వినడం? ఈ బాధంతా ... హమ్మా!'

'మిమ్మల్ని దేవుడే పంపించాడు'

'రైళ్ళో, బ్రేవో...కానీ మధ్య ఈ దేవు డెవరు?'

"ఈ ఉత్తరం చదవండి బాబూ. చదివి చెప్పేశారంటే చాలు. ఎంతో మేలు చేసిన వాళ్ళవుతారు..."

హరిహరీ! ఇదా తను చేయాల్సిన పని. బావుంది! చాలా చాలా బావుంది! అతడి ఉద్రేకం చచ్చిపోయింది! తన దుర్బుద్ధికి లోపలే చెంపలు వాయించుకొన్నాడు. చచ్చినట్లు ఉత్తరం అందుకొన్నాడు.

ప్రియా,

ఓ ప్రియా ఎలా వున్నావు...? ఎక్కడ వున్నావు? ఏం చేస్తున్నావ్ ? నాకు...ఇక్కడ పిచ్చెత్తు తోంది. ఒక చోట నిల్చోలేను. కూర్చోలేను. నా కళ్ళముందు నీ సుందరరూపం... ఏం రాయను! నీ మీదే వున్నది నా ధ్యాసంతా! ఇక్కడ ఇల్లు కుదరడానికి ఇన్ని రోజులు పట్టింది. ఏం చేయను చెప్పు! నిన్ను విడిచి ఓ క్షణం వుండలేను. నువ్వు లేని జీవితం వొంటరి ఎడారి ప్రయాణం వంటిది. నీవు లేని ఇల్లు, నరకకూపం వంటిది. నీవు లేని రాత్రి యుద్ధభూమి లోని భీకర రాత్రి! అవును ప్రియా! చస్తు న్నాను...నీ కోసం...నీ కోసం ... నేను ... నేను ... ఏమో అయిపోతున్నాను. ఇక్కడ ఇల్లు కుదిరింది. నీవు నిముషాల మీద బయలుదేరి రావాలి. ప్రియా నీ కోసం...నీ కోసం ఈ రోజు నుంచీ రైల్వే స్టేషన్లో ప్లాట్ ఫారం టిక్కెట్ తీసుకొని వేచి చూస్తూవుంటాను. ట్రైనొస్తే, వేయి కళ్ళతో, కళ్ళలో వత్తులు వేసుకొని గాలిస్తూ వుంటాను. వస్తావు కదూ...ప్రియా ప్రియా..........."

విఘ్నేశ్వరరావు ఉత్తరం చదవడం పూర్తి చేసి, ఎదురుగా గోడకు ఆనుకొని నిల్చున్న ఆమెకేసి చూశాడు. ఆమె ఉత్సాహం ఇంతా అంతా కాదు.

"రమ్మన్నారా ... రమ్మన్నారాండీ? ఇప్పుడే వెళ్తాను... వెళ్తాను మూటా ముల్లే సర్దేసి..."

అమె ఉత్సాహం చూస్తే, ఆ ఉత్సాహంలో తన్నే ఎక్కడ కౌగిలించు కొంటుందో అనే అనుమానం, ఆశ కూడా కలగకపోలేదు విఘ్నేశ్వరరావుకు. "అవును ... " అన్నాడు అదోలా ... ఆముదం తాగిన...ముఖం పెట్టి! "మీరు చాలా మంచివారండి, ఎంత మంచివారండీ! ఇప్పుడు మా ఆయనే వుంటే మీకు ... మీకు మంచి బహుమాన మిప్పిద్దును"

"వెధవ మంచి—వాళ్ళాయనేవుంటే ... తనెందుకూ? ఏడవరాదూ! బహుమాన మిస్తుందట! చేసిన అవమానం చాలదూ!" అనుకొని కోపంతో పైకి లేచాడు.

"అప్పుడే లేస్తున్నారే...కూర్చోండి బాబూ కూర్చోండి. పర్వాలేదు కాఫీ తీసుకొని వెళ్లొచ్చులెండి"

'అఘోరించ లేక పోయావ్! కాఫీనట!' అనుకొంటూ లేస్తున్న విఘ్నేశ్వరరావు ఆమెముఖం లోకి చూశాడు. ఎప్పటి లాగే ఉత్సాహంగా ఉందామె. అప్పటికి 'నిషా' వదలిన విఘ్నేశ్వరుడు ఆమె ముఖంలో ప్రశాంతత పవిత్రత, అమాయకత్వం ... రాజ్య మేలుతూ వుండటాన్ని గమనించగలిగాడు.

కూర్చున్నాడు ... కూలబడినాడు !

"ఎంత మంచి వారండీ మీరు?" అందామె ఆనందంతో! మనసులోనే ఏడ్చేశాడు విఘ్నేశ్వర రావు.